క్లుప్తంగా

వినాయక చవితి శుభాకాంక్షలు




అట్లూరు : బద్వేలు నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్య, అష్టైశ్వర్య సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ వినాయకుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో రుద్రయాగం

ప్రొద్దుటూరు క్రైం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రొద్దుటూరు బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రెశ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం రుద్రయాగం నిర్వహించారు. ఈ యాగంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయ నాయకులతో కలసి సమస్యల పత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు రామభూపాల్‌రెడ్డి, రవి, బాలజోజి, వెంకట్రామిరెడ్డి, సుబ్బయ్య, సీతారామిరెడ్డి, అన్వర్ బాషా, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామంలో తూర్పు వైపున ఉన్న కంపచెట్లలో జూదమాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజగోపాల్ ఆదివారం సాయంత్రం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,140 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

చాపాడు: మండల వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు తెలిపారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామ ప్రజలకు వైద్యం అందించి వారికి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

భగవద్గీత గ్రంధాలు పంపిణీ




భగవద్గీత గ్రంధాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకలకుంట పంచాయతీ బాలాజీనగర్, జెడ్ కొత్తపల్లె, గొల్లపల్లె, గ్రామాల్లో ఆదివారం దుత్తలూరుకు చెందిన త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి అధ్యక్షుడు జి.ప్రసాద్ ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంధాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జి.సుధాకర్, జి పెంచలరత్నం తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

గోపవరం : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని బద్వేలు రూరల్ ఎస్‌ఐ చంద్రోశేఖర్ ఆయా గ్రామాల్లోని కమిటీలకు విజ్ఞప్తి చేశారు. వినాయకచవితి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచే వినాయక ప్రతిమలను మండపాలకు తరలిస్తున్నారు. సోమవారం వినాయకచవితిని మండలంలో ఘనంగా జరుపుకోనున్నారు.

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెనుప్రమాదం



ప్లాస్టిక్ వినియోగం మానాలంటున్న విద్యార్థులు

పోరుమామిళ్ల: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి పెను ప్రమాదం ఏర్పడిందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంధాలయంలో పర్యావరణంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాల కోసం వాటిని తిన్న ఆవులు, గేదెలు, మేకలు అనారోగ్యంతో చనిపోతున్నాయన్నారు. అందువల్ల ప్లాస్టిక్ వినియోగం మానుకుంటే పర్యావరణం బాగుంటుందని అన్నారు. గ్రంధాలయ అధికారి అఫ్రిది మాట్లాడుతూ విద్యార్థులు మహానుభావుల జీవిత చరిత్రలు, కథలు, చారిత్రక, విజ్ఞానదాయక పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

కొలువుదీరవయ్యా... బొజ్జ గణపయ్యా

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో గణనాథున్ని కొలువుదీర్చేందుకు ఉత్సవ కమిటీల వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీల వారు మండపాలను సిద్ధం చేసుకుని విగ్రహాలను తమతమ మండపాల వద్దకు తరలించారు. కొందరు ఉత్సవ కమిటీల వారు రెండు, మూడు రోజుల ముందే విగ్రహాలను తీసుకువెళ్లారు. మైదుకూరు రోడ్డు, కుమ్మరికొట్టాల, సినీహబ్, కొర్రపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లోని విక్రయకేంద్రాల వద్ద వినాయకులను తీసుకెళ్లేందుకు వచ్చిన భక్తులతో ఆ ప్రాంతాలు కిటకిటలాడాయి. మినీ ఆటో, లారీ, ఎద్దుల బండ్లలో వినాయక విగ్రహాలను తరలించారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ అని నినాదాలు చేస్తూ విగ్రహాలను తీసుకెళ్లారు. పట్టణంలోని వైఎంఆర్ కాలనీ, శివాలయం ఉత్సవ కమిటీలతో పాటు పట్టణంలోని అన్ని గణపతి మహోత్సవ కమిటీల వారు చవితికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీల వారు రకరకాల రంగుల పందిళ్లతో స్టేజీలను సిద్ధం చేశారు. సోమవారం నుంచి 3, 5, 7, 9 రోజుల పాటు లంబోదరునికి పూజలు చేసి నిమజ్జనం చేయనున్నారు. కొందరు ఉత్సవ కమిటీలవారు రోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో దాదాపు 800పైగా చిన్నా పెద్ద గణపతి విగ్రహాను ఏర్పాటు చేయనున్నారు. శివాలయం వీధి, కొర్రపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేశారు. సాధారణం కంటే అధిక ధరలకు వీటిని వ్యాపారులు విక్రయించారు.



శ్రీరాములపేటలో ఏర్పాటు చేసిన వినాయక మండపం



రాజుపాళెంలో బొజ్జ గణపయ్యను నిలబెట్టేందుకు పందిళ్లను డెకరేషన్ చేస్తున్న దృశ్యం



సిద్దవటం రోడ్డు రామాలయం వద్ద గణేశ ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన మండపం

పందిళ్ల ఏర్పాట్లలో బిజీబిజీ

రాజుపాళెం : మండలంలోని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కమిటీ సభ్యులు పందిళ్ల ఏర్పాటులో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే డెకరేషన్ల పనులను పూర్తి చేసుకోగా ఒక్కో డెకరేషన్‌కు రూ.5 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో వినాయకుడిని రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేసి తీసుకెళుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 82 విగ్రహాలకు పైగా కొలువు దీరనున్నాయి.

మొదలైన చవితి సందడి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఆయా వీధుల్లో గణపతి విగ్రహాలను కొలువదీర్చడానికి కమిటీ నిర్వాహకులు, ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వివిధ రకాల డిజైన్లతో భారీ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలితో పాటు నెల్లూరు రోడ్డు, మైదుకూరు రోడ్డు, సిద్దవటం రోడ్డులలో పండుగ వాతావరణం కనిపించింది. వినాయకుని ప్రతిమలతో పాటు వినాయకుడికి ఇష్టమైన చెరుకుగడలు, వెలక్కాయలు, గడ్డి, పూలు, పండ్లు తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టణ పరిధిలో సుమారు 120కు పైగా విగ్రహాలు నెలకొల్పనున్నారు.



అమ్మకానికి సిద్ధంగా మట్టిగణపతి విగ్రహాలు




కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న మార్కెట్



గ్రామాలకు తరలుతున్న బొజ్జ గణపయ్య

మట్టి విగ్రహాలు అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అవోపా కార్యాలయంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విగ్రహదాతలు డాక్టర్ వంకదార శివరాం, డాక్టర్ మహాలక్ష్మి, అవోపా అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య, కార్యదర్శి నరసింహా రావు, ట్రెజరర్ సురేష్‌బాబు, మాజీ జిల్లా అధ్యక్షుడు గాదంశెట్టి గోపాల్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరి రాజా వెంకటవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజీవ్ సర్కిల్‌లో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 200 మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విజయకుమార్ సర్కిల్‌లో పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పసుపుల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

మట్టివినాయక విగ్రహాలనే పూజించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ నాగార్జున పేర్కొన్నారు. శ్రీరాములపేటలోని నాగార్జున హాస్పిటల్‌లో ఆదివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి వినాయకున్ని ప్రతిష్టిద్దాం–పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డేవిడ్‌రాజ్, నాయకులు ప్రదీప్, శ్రీహరి, సత్య పాల్గొన్నారు.

విత్తన మట్టి విగ్రహాలు పంపిణీ

ప్రొద్దుటూరు : ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయంలో ఆదివారం విత్తన మట్టి వినాయక విగ్రహాలను ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప డివిజన్ జనరల్ సెక్రటరీ ఎ.రఘునాథరెడ్డి పంపిణీ చేశారు. రఘునాథరెడ్డి, వినాయక విగ్రహాల కమిటీ కన్వీనర్ బీటీవీ రావు, ఎల్‌ఐసీ బ్రాంచ్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాసరావు, బ్రాంచ్ సిబ్బంది భాస్కర్ రెడ్డి, లీలావతి, భానుప్రసాద్, నిహారిక, సురేష్ నాగవర్ధన్, సునీల్, శిఖామణి పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ జయంతి



గ్రామోత్సవంలో విశ్వకర్మ భగవానుడు



కలశోత్సవంలో విశ్వ బ్రాహ్మణులు

ప్రొద్దుటూరు : స్థానిక ఆచార్ల కాలనీలోని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం విశ్వకర్మ యజ్ఞ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాతం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం విశ్వకర్మ భగవానుని గ్రామోత్సవం విరాట్ నగర్ కాలనీ పురవీధుల్లో గా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు తాలూకా విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో స్థానిక విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం వద్ద విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. కలశాలతో బ్రహ్మంగారిమఠం, ఈశ్వరీదేవి మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, కుంకుమార్చనలు, రాత్రికి గాయత్రీ సమేత విశ్వకర్మ భగవానుని గ్రామోత్సవం జరిపారు.

తీరిన రైతుల సమస్య

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు సమీపంలోని రామసుబ్బమ్మ చెరువు పైతట్టు పొలాలకు వెళ్లాలంటే ఓవైపు చెరువు కట్టపై వంతెన లేక రైతులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో రైతుల కోరిక మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల కృషితో మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రత్యేక చొరవతో వంతెన సమస్య తీరింది. రూ.17.30లక్షలతో చెరువు వద్ద రైతులు వెళ్లేందుకు చిన్నపాటి వంతెన నిర్మించారు. చెరువు పొడవునా వంతెనకు ఇరువైపులా గ్రావెల్ రోడ్డు నిర్మించారు. ఈ వంతెనను ఆదివారం మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, ఉప ఎంపీపీ సుందరమ్మ, సర్పంచ్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే స్వయంగా అధికారులతో మాట్లాడి వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ వంతెన కోసం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య, ప్రసాద్, మనోహర్ కష్టపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి రాణి, జయరామిరెడ్డి, రామాంజనేయులరెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లవోలు రామసుబ్బమ్మ చెరువు కట్టపై వంతెనను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ట్యాక్స్ చెల్లించి బంగారం తెచ్చుకున్నాం

పోలీసులు అరెస్ట్ చేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదు



మాట్లాడుతున్న చాంద్‌బాషా

ప్రొద్దుటూరు క్రైం : తమను ఎవరూ అరెస్ట్ చేయలేదని తగు రశీదులు చూపించిన తర్వాత బంగారంతో సహా పోలీసులు తమను పంపించారని అల్‌నూర్ ట్రావెల్స్ యజమాని చాంద్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న తనతో పాటు 20 మంది ఉమ్రా యాత్రికులు జిద్దా నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగారన్నారు. అక్కడ లగేజి తనిఖీ చేసే సమయంలో తన వద్ద బంగారు గొలుసులు ఉన్న కారణంగా కస్టమ్స్ అధికారులకు రూ. 1.38 లక్షలు ట్యాక్స్ చెల్లించినట్లు ఆయన తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటికి వచ్చిన బంగారు గొలుసులను తన అన్న కుమారుడికి ఇచ్చి టాయిలెట్‌కు వెళ్లినట్లు తెలిపారు. అంతలోనే ఎయిర్‌పోర్టు పోలీసులు పెద్ద మొత్తంలో బంగారు కలిగిన కర్నూలు వాసితో పాటు తన అన్న కుమారున్ని కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. తాను విషయం తెలుసుకొని తన వద్ద ఉన్న కస్టమ్స్ పే రసీదు చూపించగా బంగారుతో సహా తన అన్న కుమారున్ని పోలీసులు పంపించారన్నారు. అయితే ప్రొద్దుటూరుకు వచ్చిన తర్వాత 11వ తేది నుంచి సోషల్ మీడియాలో తాను బంగారం తెస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారంటూ స్మగ్లర్లుగా ప్రచారం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఇందులో వాస్తవం లేదన్నారు. 20 ఏళ్ల నుంచి ఉమ్రా, హజ్ ట్రావెల్ ఏజెంట్‌గా సేవలు అందిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్–14, 16, 18 బాలబాలికలకు, అండర్–20 స్త్రీ, పురుషులకు 60, 100, 200, 300, 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీలు, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హై జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభకనబరిచిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలను బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు అహమర్ బాషా, వ్యాయామ సంచాలకులు బనగానపల్లె బాషా, నరేష్, లక్ష్మీ, నాగేశ్వరరావు, రాజశేఖర్, రవి, కేశవ తదితరులు పర్యవేక్షించారు.



పరుగు పోటీలో క్రీడాకారులు

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామ సమీపంలోని గాలిమర్రల వద్ద ఆదివారం పేకాట అడుతున్న ఆరు మందిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి 25 మద్యం బాటిళ్లు, రూ.40.000 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు కొండాపురం సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

పట్టుపురుగుల పెంపకంతో అధిక లాభాలు



పట్టు గుడ్లను పరిశీలిస్తున్న అధికారి, రైతు

జమ్మలమడుగు : రైతులు పట్టు పురుగుల పెంపకం వల్ల మంచి ఆదాయాన్ని పొందవచ్చునని పట్టుపరిశ్రమశాఖ అధికారి రమాదేవి తెలిపారు. ఆదివారం మండలంలోని తూగుట్లపల్లిలో ఆదర్శ రైతు జయసింహారెడ్డి సాగుచేసిన పట్టు పురుగుల కేంద్రాన్ని ఆమె పరిశీలించి ఆ రైతుతో మాట్లాడారు. రైతు మాట్లాడుతూ 8 ఎకరాలలో గతేడాది మల్బరీ తోటను సాగుచేశానని, గత నెల 25వ తేదీన మూడు ఎకరాల విస్తర్ణం పొలంలో 300 పట్టు పురుగుల గుడ్లను వదిలి కేవలం 15 రోజులు మేపడం జరిగిందన్నారు. పట్టు గుడ్లను మార్కెట్‌లో అమ్మడం వల్ల లక్షా 60వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ అధికారి మాట్లాడుతూ రైతులు మల్బరీ తోటలను పెంచటానికి ముందుకు రావాలని సూచించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

బద్వేలు అర్బన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ గడపకు వెళ్లినా ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో గల మెయిన్‌బజార్, అమ్మవారిశాలవీధి, కాపువీధి, బెస్తవీధి, రజకవీధిలలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవి కావని, నేడు మన జగనన్న ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, వైపీయూ పాలక మండలి సభ్యుడు కొండపల్లి చిన్నసుబ్బారావు, కౌన్సిలర్లు గానుగపెంట సమత, చెవుల వెంకటేశ్వర్లు, పుత్తా మహేష్, కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ హుసాన్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు జీ.ఎస్.రమేష్‌బాబు, శివయ్య, బిజ్జం రమణ, అనిల్, ఇమాం హుస్సేన్, కృష్ణ, నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కాపువీధిలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈగా ఎం.కుళాయప్ప



బద్వేలు అర్బన్ : ఏపీఎస్‌పీడీసీఎల్ బద్వేలు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎం.కుళాయప్ప ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అనంతపురం డీఈఈగా పనిచేస్తున్న ఈయనను బద్వేలు డీఈఈగా బదిలీచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు మేరీషర్మిల, చిన్నయ్య, విజయకుమార్, రవిశంకర్‌లు డీఈఈని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న రవిచంద్రశేఖర్ అనంతపురం జిల్లా ఉరవకొండ డీఈఈగా బదిలీ అయ్యారు.

అనాథలకు చేసిన సేవలు అభినందనీయం

కాశినాయన : ఏ ఆదరణ లేని అనాథలను అక్కున చేర్చుకుని వారికి సకల సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండలంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమాన్ని ఆమె పరిశీలించారు. అక్కడి వృద్ధులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామతులసిలు చిన్న వయస్సులోనే సేవాదృక్పథం కలిగి ఉండి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి సేవలందించడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్యే డాక్టర్ సుధను సత్కరిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి దంపతులు

స్వర్ణకారుల సంక్షేమం కోసం కృషి చేస్తా



రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పఠాన్ లియాస్‌ఖాన్‌ను సన్మానిస్తున్న స్వర్ణకారులు

జమ్మలమడుగు : స్వర్ణకారులు సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తానని స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పఠాన్ లియాస్‌ఖాన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్వర్ణకారులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం స్వర్ణకారులకు సంక్షేమ పథకాలతో పాటు నిరుపేద స్వర్ణకారుల జీవన భృతికోసం బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు ఇప్పించి ఆదుకోవాలని సూచించారు. అనంతరం పఠాన్ లియాస్‌ఖాన్‌ను పట్టణంలోని స్వర్ణ కారులు ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో స్వర్ణకారుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఖాద్రీ పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆది వారం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని అమలుపరచడానికి ఉత్సాహం చూతోంతుందన్నారు. పాత పెన్షన్ మాత్రమే ఆమోద్యయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, సుజాత, నరసింహారావు, చెన్నయ్య, శ్రీనివాసులు, రమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు